

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల, హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, రవిశంకర్, సతీశ్‌బాబు

కరీంనగర్‌లో కదనభేరి

మొదటిపేజీ తరువాయి...

ఆదివారం కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గాల ముఖ్యనేతల సమావేశం సమావేశం నిర్వహించారు. కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన నేతలతో కేసీఆర్ విడివిడిగా సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపికపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకు ఈ నెల 13 తర్వాత ఏ క్షణమైనా షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉన్నదని, దీనిని దృష్టిలో పెట్టుకొని కరీంనగర్‌లో భారీ సభను ఏర్పాటు చేసుకుందామని ప్రతిపాదించారు. రాష్ట్రవ్యాప్తంగా మంచి మెసేజ్ వెళ్లేలా, లోక్‌సభ ఎన్నికల సన్నాహక సభగా దీనిని నిర్వహించాలని సూచించారు. దీనికి కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలంతా అంగీకరించారు. భారీ బహిరంగ సభను ఎక్కడ నిర్వహించాలన్న చర్చ జరుగుతున్నపుడు పార్టీకి తొలి నుంచి అచ్చివచ్చిన ఎస్ఆర్ఆర్ గ్రౌండ్‌లో అయితే బాగుంటుందని కరీంనగర్ స్థానిక నేతలు పట్టుబట్టారు. పార్టీ మొదటినుంచి అక్కడ పెట్టిన ప్రతి సభ సక్సెస్ అయిందని, ఉద్యమకాలం నుంచి నేటివరకు ఆ గ్రౌండ్ సెంటిమెంట్ అని చెప్పారు. నేతలంతా ఎస్ఆర్ఆర్ మైదానంలో సభ పెట్టాలని ప్రతిపాదించడంతో కేసీఆర్ అందుకు ఒప్పుకున్నారు. ఈ నెల 12న సభను నిర్వహించాలని ఆ రోజు వీలుకాకపోతే 11 లేదా 13వ తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే సభ ఉంటే షెడ్యూల్ వచ్చిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలవారీగా బస్సుయాత్ర చేపట్టాలని యోచిస్తున్నట్టు కేసీఆర్ వెల్లడించారు. బస్సుయాత్రతో రోడ్‌షోలు చేపడితే నియోజకవర్గంలోని ఎక్కువ గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలను చుట్టిరావచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రతి మండలంలో పార్టీ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించాలని, ఈ సన్నాహక సమావేశంలోనే కరీంనగర్ సభ గురించి వివరించాలని, పార్టీ గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కేసీఆర్ సూచించారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నేతలూ మండల స్థాయిలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు, కోల్‌మైన్ ప్రాంతంలో గేట్‌మీటింగ్‌లు నిర్వహించాలని సూచించారు. సింగరేణి కార్మికులను కలిసి వారికి బీఆర్ఎస్ సర్కారు ఎలాంటి సౌకర్యాలు కల్పించింది, సింగరేణి సంస్థను ఎలా కాపాడింది వివరించాలని దిశానిర్దేశం చేశారు.

> బీఆర్ఎస్ ఒక్కటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుంది. బీఆర్ఎస్‌కు శక్తి ఇవ్వడం అంటే తెలంగాణ ప్రజలు తమకు తాము శక్తిమంతులు కావడమే. తెలంగాణకు బలం ఇవ్వడమే.
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రజల కోసం పనిచేద్దాం

ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ప్రజల కోసం పనిచేయాలని, రాజకీయాలంటే గెలుపోటములు ఒక్కటే కాదని కేసీఆర్ ఉద్బోధించారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తాను ఇదే విషయాన్ని అనేక సందర్భాల్లో చెప్పానని గుర్తుచేశారు. ఏ పాత్రలో ఉన్నా ప్రజల కోసం పనిచేయడాన్ని నాయకులు అలవర్చుకోవాలని సూచించారు. గెలుపుతో పొంగిపోవద్దని, ఓటమితో కుంగిపోవద్దని, ఇప్పుడు ఓడిపోవడం కూడా ఒక రకంగా బీఆర్ఎస్‌కు మంచిదేనని, ప్రజలకు కూడా ఎవరేమిటో అర్థమవుతున్నదని చెప్పారు. ఒక్కసారి ఓడిపోతే ఏదో భూకంపం వచ్చినట్టుగా భావించొద్దని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని విశ్లేషించుకోవాలని, ఎక్కడైనా పొరపాటు జరిగిందనుకుంటే చక్కదిద్దుకుందామని స్పష్టంచేశారు. ప్రజలకు మేలు చేసే ప్రయత్నమే చేశామని, తొమ్మిదేండ్ల పాలనలో దేశంలో ఎవ్వరూ చేయనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశామని వివరించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1985-1989 మధ్య అనేక సంస్కరణలు తెచ్చారని, అయినా 1989లో ఓడిపోయారని, తర్వాత ప్రజలు వాస్తవాలను గుర్తించడంతో అంతకు రెట్టింపు మెజార్టీతో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారని గుర్తుచేశారు.

నీళ్లు.. కరెంటు.. దేన్నీ పట్టించుకుంటలేరు

కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ మొదలైందని కేసీఆర్ చెప్పారు. చాలాచోట్ల రైతులకు సాగునీటిని ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. రైతులు పంటలను పశువుల కోసం వదిలివేస్తున్నారని, ఎండిపోయిన పొలాలు దర్శనమిస్తున్నాయని, కొన్నిచోట్ల రైతులు పంట వేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు కచ్చితంగా సాగునీళ్లు వచ్చేలా చూశామని గుర్తుచేశారు. కాలువల ద్వారా చెరువులను నింపి రైతులకు అందేలా చూశామని చెప్పారు. దీనివల్ల భూగర్భజలాలు పుష్కలంగా పెరిగి బోర్లలో నీళ్లుండేవని వివరించారు. ఇప్పుడు కాలువల ద్వారా చెరువుల్లోకి నీళ్లు నింపడంలేదని, బోర్ల ద్వారా పంటలకు నీళ్లు తోడుకుందామంటే కరెంటు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. చాలాచోట్ల రైతుల్లో ఈ చర్చ మొదలైందని చెప్పారు. కరెంటు సమస్యను తీర్చేందుకు తాము ఎలా ప్రణాళికలు రచించి అమలు చేశామో వివరించారు. ఇప్పుడు మళ్లీ ఐఏఎస్ అధికారులను నియమించారని, గతంలో తాము విద్యుత్తు సంస్థల్లో పనిచేసిన సీనియర్ అధికారులతో సంస్థను నడిపామని గుర్తుచేశారు.

బీఆర్ఎస్‌కు శక్తి ఇవ్వడం అంటే.. తెలంగాణకు బలం ఇవ్వడమే

ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ గురించి స్పష్టమైన అవగాహన కలిగించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఒక్కటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుందని చెప్పారు. బీఆర్ఎస్‌కు శక్తి ఇవ్వడం అంటే తెలంగాణ ప్రజలు తమకు తాము శక్తిమంతులు కావడమేనని, తెలంగాణకు బలం ఇవ్వడమేనని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్టీ మొన్నటి శాసనసభ ఎన్నికల్లో భారీ తేడాతో ఓడిపోలేదని, 39 స్థానాలు సాధించగలిగామని, మరో 15 స్థానాల వరకు తక్కువ ఓట్లతో ఓడిపోయామని వివరించారు. అధికార పార్టీకి, బీఆర్ఎస్‌కు మధ్య 1.8 శాతమే ఓట్ల తేడా ఉన్నదని స్పష్టంచేశారు. ఒకరిద్దరు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఏమీ కాదని, మళ్లీ మనం వంద సీట్లతో అధికారంలోకి వస్తామన్న ధీమా వ్యక్తంచేశారు. ఓటమి వల్ల ఎవరేమిటో తెలుస్తున్నదని చెప్పారు. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణను నదిలో వదిలేయలేమని, కొట్లాడుదామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక నెల రోజులు ఆగితే ఫుట్‌బాల్ ఆడవచ్చని చెప్పారు.

> ఒకరిద్దరు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఏమీ కాదు. మళ్లీ మనం వంద సీట్లతో అధికారంలోకి వస్తాం. ఓటమి వల్ల ఎవరేమిటో తెలుస్తున్నది. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని నదిలో వదిలేయలేం. కొట్లాడుదాం. రాష్ట్రంలో ఉన్న ఈ ప్రభుత్వాన్ని ఒక నెల రోజులు ఆగితే ఫుట్‌బాల్ ఆడవచ్చు.
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

నేడు అభ్యర్థుల ప్రకటన

కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పేర్లను ఆయా నియోజకవర్గాల నేతలు ప్రతిపాదించారు. వారి పేర్లపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో సోమవారం వీరి పేర్లను పార్టీ అధికారికంగా ప్రకటించనున్నది. ఈ విషయాన్ని కేసీఆర్ స్వయంగా చెప్పారు. సోమవారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల సమావేశం నిర్వహించనున్నారు. ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను సోమవారమే ప్రకటించే అవకాశం ఉన్నది. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు హాజరయ్యారు.

మొత్తం పళ్లు ఊడగొంటుకుంటమా?

మేడిగడ్డ బరాజ్ అంశం చర్చకు వచ్చినప్పుడు కేసీఆర్ స్పందిస్తూ.. 'నోట్లోని ఒక పన్నుకు ఏదైనా సమస్య వస్తే ఆ పన్ను తీసివేస్తాం. అంతేగానీ మొత్తం పళ్లను ఊడగొట్టుకుంటామా? పోయిన పన్నుపై మాత్రమే దృష్టిపెట్టి దాన్ని ఎలా సరిచేయాలో చూసుకుంటాం' మేడిగడ్డ బరాజ్ దగ్గర సమస్య వచ్చిన చోట దానిని పరిష్కరించుకుంటే సరిపోతుందని వివరించారు. దేశంలో, ప్రపంచంలో అనేక ప్రాజెక్టులు కట్టిన తర్వాత సమస్యలు వచ్చినవి ఉన్నాయని, సాక్షాత్తు ప్రధాని మోదీ ప్రారంభించిన ఒక ప్రాజెక్టు కూడా ప్రారంభించిన 15 రోజులకే కొట్టుకుపోయిందని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో కూడా అనేక ప్రాజెక్టులు ఇలా అయినవి ఉన్నాయని వివరించారు. తెలంగాణ ఏర్పడే నాటికి మిడ్‌మానేరులో కూడా అనేక సమస్యలొచ్చాయని, వాటిని సరిదిద్ది ప్రజలకు నీళ్లిచ్చామని గుర్తుచేశారు.

> కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ మొదలైంది. చాలాచోట్ల రైతులకు సాగునీటిని ఇవ్వలేకపోతున్నారు. పంటలను పశువుల కోసం వదిలివేస్తున్నారు. ఎండిపోయిన పొలాలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులు పంట వేసుకోలేకపోయారు. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు కచ్చితంగా సాగునీళ్లు వచ్చేలా చూశాం.
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీజేపీది మతపిచ్చి

దేశానికి, తెలంగాణకు బీజేపీ చేసిన గొప్పమేలు ఏమీలేదని, ఆ పార్టీది మతపిచ్చి అని కేసీఆర్ చెప్పారు. దేశంలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు ఇలా అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎప్పటికీ సెక్యులర్ పార్టీనే అని, సెక్యులర్‌గానే ఉంటుందని స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరికీ చెప్పాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంటుందని, త్రిముఖ పోరు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటుందని విశ్లేషించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి నాయకత్వలేమి ఉన్నదని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని తెలిపారు.

ఈసారి మాడు పగులుడే!

- శివరాత్రికి ముందు నుంచే మండే ఎండలు
- తాజాగా 40 డిగ్రీలకు చేరువలో పగటి ఉష్ణోగ్రత
- సాధారణం కన్నా 5 డిగ్రీలు పెరిగే ప్రమాదం
- వారంలోనే 40 డిగ్రీలకు చేరుతుందని అంచనా

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఈసారి శివరాత్రి రాకముందే ఎండలు దంచికొడుతున్నాయి. చలి ప్రభావం తగ్గి మార్చి తొలివారంలోనే అధిక ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు మండుతున్నాయి. ఆదివారం ఏకంగా సగటు ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్ దాటినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు చేరుకోవడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. సిద్దిపేట, ములుగు, వనపర్తి జిల్లాల్లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని ఆ శాఖ తెలిపింది. గద్వాల, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, ఖమ్మం జిల్లా మధిర, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, ములుగు జిల్లా తాడ్వాయి మండలాల్లో 38.9, భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో 38.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైనట్టు వెల్లడించింది. మరో ఐదు రోజులపాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని, ఒకటి రెండు వారాల్లో సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకుంటుందని ఆందోళన నెలకొన్నది.

దంచికొడుతున్న ఎండలు

ఈసారి వేసవిలో పగలు సగటు ఉష్ణోగ్రతల కన్నా దాదాపు 5 డిగ్రీల మేర అధికంగా నమోదవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొన్నేండ్లుగా సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నట్టు చెప్తున్నారు. నిరుడు ఎండాకాలంలో (మార్చి నుంచి మే వరకు) అత్యధికంగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో నమోదైంది. మే 18న 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈసారి అంతకు మించి నమోదయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం నిరుడు మార్చిలో 35.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, ఈసారి 3న 37 డిగ్రీలు దాటడం గమనార్హం. నిరుడు మార్చి 31న అత్యధికంగా నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలంలో 42.6 డిగ్రీలు నమోదైంది. ఈసారి మార్చి మొదటి వారంలోనే 40 డిగ్రీలు దాటడం ఆందోళన కలిగిస్తున్నది. జీహెచ్ఎంసీలోనూ ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. 2021 మార్చి 3న 33 డిగ్రీలు ఉండగా, ఈ ఆదివారం 34 డిగ్రీలుగా నమోదైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎండాకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.9°c	18.9°c
నల్లగొండ	38.6°c	23.8°c
రంగారెడ్డి	38.7°c	16.8°c
నిజామాబాద్	38.2°c	24.4°c
ఖమ్మం	38.0°c	23.0°c
మెదక్	36.7°c	19.0°c
మహబూబ్‌నగర్	36.5°c	22.2°c
కరీంనగర్	36.0°c	23.0°c
వరంగల్	36.0°c	22.0°c
హైదరాబాద్	35.3°c	23.5°c

బీజేపీలో టికెట్ల మంటలు

మొదటిపేజీ తరువాయి...

నుంచి ప్రచారం సాగుతున్నది. రాష్ట్ర రాజకీయాల్లో తనకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని అసంతృప్తితో ఉన్న రాజాసింగ్.. ఎంపీగా పోటీచేసి ఢిల్లీకి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అందులో భాగంగా తొలుత జహీరాబాద్ టికెట్ కోసం ప్రయత్నించగా.. బీబీపాటిల్ టచ్‌లో ఉండటంతో అధిష్ఠానం సమాధానం ఇవ్వలేదు. దీంతో హైదరాబాద్ నుంచి అయినా పోటీ చేయాలని రాజాసింగ్ భావించినట్టు తెలుస్తున్నది. కానీ, ఆ టికెట్ మాధవీలతకు దక్కడంతో రాజాసింగ్ అసంతృప్తితో రగిలిపోతున్నట్టు స్థానిక నాయకులు చెప్తున్నారు. 'హైదరాబాద్‌లో నిలబెట్టేందుకు మగాడే దొరకలేదా?' అని ఆయన బీజేపీ అధిష్ఠానంపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్టు వినికిడి.

మిగతా చోట్లా అసంతృప్తి సెగలే

జహీరాబాద్ టిక్కెట్‌ను బీబీపాటిల్‌కు ఇవ్వవద్దని బీజేపీ నాయకులు, కార్యకర్తలు చాలా రోజుల నుంచి నిరసన తెలుపుతున్నారు. ఆ టికెట్ కోసం మాజీ మంత్రి బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి, అలె నరేంద్ర కుమారుడు భాస్కర్ పోటీ పడ్డారు. కానీ, చివరి నిమిషంలో కాషాయ కండువా కప్పుకున్న బీబీపాటిల్‌కు మరుసటి రోజే ఆ టికెట్‌ను కేటాయించడంతో వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. చివరి నిమిషంలో బీజేపీలో చేరిన ఎంపీ రాములు నాగర్‌కర్నూల్ టికెట్‌ను తన కుమారుడికి ఇప్పించుకోవడంతో ఆ సీటును ఆశించి భంగపడిన బంగారు లక్ష్మణ్ కుమార్తె శృతి సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. భువనగిరి టికెట్ బూర నర్సయ్యగౌడ్‌కే దక్కుతుందని చాలా కాలం నుంచే ప్రచారం జరుగుతుండటంతో ఆ సీటు కోసం ఇతర నేతలు ప్రయత్నాలు చేయలేదు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ, మహబూబాబాద్ స్థానాలపై బీజేపీ ఆశలు పెట్టుకోకపోవడంతో ఆయా నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ ఓట్లు సాధించే నేతల కోసం ఎదురుచూస్తున్నది. అందుకే అక్కడ అభ్యర్థులను ప్రకటించలేదనే ప్రచారం ఉన్నది. మిగిలిన మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్ టికెట్లపై బీజేపీలో ఉత్కంఠ కొనసాగుతున్నది. మహబూబ్‌నగర్ టికెట్‌ను డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ఆశిస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు డీకే అరుణ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల నుంచి తప్పుకున్నారు. జితేందర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తన కుమారుడికి టికెట్ ఇప్పించుకున్న సంగతి తెలిసిందే. జితేందర్‌రెడ్డి ఎంపీ టికెట్ అడగకపోతేనే ఆయన కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తామని అప్పట్లో అమిత్ షా షరతు విధించారనే ప్రచారం ఉన్నది. కానీ, ఇప్పుడు తాను కూడా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతానంటూ జితేందర్‌రెడ్డి బీజేపీ అధిష్ఠానానికి సంకేతాలు ఇస్తుండటంతో మహబూబ్‌నగర్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. మెదక్ ఎంపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతోపాటు అంజిరెడ్డి పోటీ పడుతున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు బీజేపీని వీడుతారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతుండటంతో ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించలేదని తెలుస్తున్నది. ప్రధాని మోదీ ఆదిలాబాద్‌లో జరుపనున్న పర్యటన సందర్భంగా ఆ స్థానానికి అభ్యర్థిని ప్రకటించనున్నట్టు సమాచారం. మొత్తంగా బీజేపీలో టికెట్ల పంచాయితీ రానురాను మరింత రచ్చకెక్కుతుండటంతో ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

మల్కాజిగిరిలో జాబితా పెద్దదే?

బీజేపీలో మల్కాజిగిరి ఎంపీ సీటును ఆశించిన నేతల జాబితా కూడా చాలా పెద్దదే. వారిలో మల్క కొమురయ్య లాంటి కొందరు నేతలు ఇప్పటికే ప్రచారానికి రూ.కోట్లు ఖర్చు పెట్టగా.. సీనియర్ నేత మురళీధర్‌రావు లాంటి మరి కొందరు నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలు చేస్తూ ప్రజల దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. వారితో పాటు వీరేందర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, పన్నాల హరీశ్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, సామ రంగారెడ్డి తదితరులు కూడా మల్కాజిగిరి టికెట్ కోసం పోటీపడ్డారు. కానీ, ఈ టికెట్‌ను ఈటల రాజేందర్‌కు ప్రకటించడంతో మిగతా నేతలంతా అలిగారు. దీంతో వీరంతా త్వరలో బీజేపీని వీడుతారనే ప్రచారం జరుగుతున్నది. ఈ ప్రచారానికి మురళీధర్‌రావు తన ట్వీట్‌తో మరింత బలాన్ని చేకూర్చారు. ఇతర నాయకులు, కార్యకర్తలతో చర్చించి త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలో తగ్గుతున్న తెలుగు ప్రభ

మొదటిపేజీ తరువాయి...

వెంకయ్యనాయుడు ఆ స్థాయిని కొంతవరకు నిలబెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలుగువారి పాత్ర కనిపించడమే లేదని, ఇది మన మనుగడకు, గుర్తింపునకు మంచి పరిణామం కాదని అభిప్రాయపడ్డారు. జాతీయ స్థాయిలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని, అదేస్థాయిలో నాయకత్వం కూడా ఉండాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కేంద్ర క్యాబినెట్‌లో తెలుగువాళ్లను వెతికి చూసుకోవాల్సిన పరిస్థితి ఉన్నదని చెప్పారు. ఈ లోటును పూడ్చేందుకు అందరూ చొరవ చూపాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. గతంలో నంద్యాలలో పీవీ పోటీ చేసినపుడు.. ఏకగ్రీవం చేసేందుకు ఎన్టీఆర్ చొరవ చూపారని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఇది సత్సంప్రదాయమని, తమ ప్రభుత్వం కూడా దీనిని పాటిస్తుందని చెప్పారు. రాష్ట్రాలుగా విడిపోయినా మనుషులుగా మనం కలిసి ఉండాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

మళ్లీ 6 బోర్ల రాంరెడ్డి

- ఇప్పటికే 6 బోర్లు వేసిన ముషంపల్లి రైతు
- ఉమ్మడి రాష్ట్రంలో వందకుపైగా బోర్లు
- కేసీఆర్ పాలనలో సాఫీగా వ్యవసాయం
- కాంగ్రెస్ హయాంలో మళ్లీ రైతుల కష్టాలు
- నల్లగొండ జిల్లాలో కరువు మేఘాలు
- ఒక్కో గ్రామంలో వందలాది కొత్త బోర్లు
- విరామం లేకుండా బోరుబావుల తవ్వకం
- వేలాది ఎకరాలకు పాంచి ఉన్న ముప్పు
- పరిస్థితి ఇలాగే ఉంటే సగానికి పైగా నిలువునా ఎండిపోనున్న తోటలు

నల్లగొండ మండలం ముషంపల్లి చెరువులో బోరు వేసుకుని తోటలకు పైపులైన్ వేసుకుంటున్న రైతులు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 3 (నమస్తే తెలంగాణ): అది 2003వ సంవత్సరం. ఎటు చూసినా కరువు తాండవిస్తున్నది. ఎండిపోయిన చెరువులు.. నెర్రెలుబారిన భూములు.. అంతంతమాత్రంగా విద్యుత్తు సరఫరా. ఇలాంటి పరిస్థితుల్లో తన బత్తాయి తోటను కాపాడుకునేందుకు ఓ రైతు ఏకంగా 100కుపైగా బోర్లు వేశాడు. ఆయన పేరు బైరెడ్డి రాంరెడ్డి. కానీ, నీటి కోసం భగీరథ ప్రయత్నం చేసి ఒకదాని తర్వాత ఒకటిగా బోర్లు వేసి బోర్ల రాంరెడ్డి అయ్యారు. తెలంగాణలో నాటి దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయన చేసిన సాహసం గురించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తరచూ ప్రస్తావించేవారు. నల్లగొండ పక్కనే ఉన్న ముషంపల్లికి చెందిన రాంరెడ్డి స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ఆయన కష్టాలు తీరిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంటు, సాగునీరు, రైతుబంధు వంటివి క్రమం తప్పకుండా అందడంతో రాంరెడ్డి వ్యవసాయం గాడిన పడింది. ప్రస్తుతం 10 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో బత్తాయితోట సాగు చేస్తున్నారు. 8 ఏండ్లుగా సాఫీగా సాగిన వ్యవసాయం మళ్లీ మొదటికొచ్చింది. రాజుకు మౌనభంగం కావడంతో బేతాళుడు మళ్లీ చెట్టెక్కినట్టు.. కరువు మళ్లీ ముంచుకొచ్చింది. పట్టువదలని విక్రమార్కుడిలా రాంరెడ్డి పంటలు కాపాడుకునేందుకు బోర్ల బాటపట్టారు. రూ.లక్షన్నర వెచ్చించి సొంత భూమిలో నాలుగుబోర్లు వేశారు. చుక్కనీరు పడలేదు. గ్రామంలోని ఇతర రైతులు చెరువులో బోర్లు వేయిస్తున్నారని తెలిసి అక్కడ కూడా రెండు బోర్లు వేశారు. ఒక బోరులో కొద్దిగా నీరు పడడంతో ఆ నీటిని తోటకు తరలించేందుకు రూ.6 లక్షలు వెచ్చించి మూడు కిలోమీటర్ల దూరంలోని తన పొలానికి పైప్‌లైన్ వేస్తున్నారు. ఇంతా చేస్తే ఆ బోరు నుంచి ఎన్ని రోజులు నీరు వస్తుందో తెలియదు. వరిపొలం పోతే పోయింది.. ఏడేండ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న బత్తాయితోట ఎండిపోతే ఎలా అని ఆయనకు రందిపట్టుకున్నది.

పొలం పోతే పోనీ గానీ బత్తాయి ఎండుతున్నది

> కాల్వ నీళ్లను నమ్ముకొని పదేకరాలు పొలం పెడితే ఇప్పటి దాకా ఐదున్నర ఎకరాలు ఎండిపోగా ఇంకా నాలుగున్నర ఎకరాలు జరజర పారుతుంది. నాలుగు రోజులైతే అదికూడా పోతది అనిపిస్తుంది. రెండు లచ్చలన్నర పెట్టి ఆ పొలం పెడితే గింజ కూడా వచ్చే పరిస్థితి కనిపిస్తలేదు. పొలం ఎలాగూ నష్టం జరుగుతదని అర్థమైంది కానీ ఏటా నాలుగు పైసలొచ్చే బత్తాయి తోట ఎండుతుందనే భయం పట్టుకున్నది. పాత బోర్లు నాలుగు ఉంటే నాలుగు పోయినయి.
> -బక్కతట్ల కోటయ్య, రైతు, ముషంపల్లి గ్రామం, నల్లగొండ మండలం

రోజుకు పది బోర్లు

నిడమనూరు మండలం ఎర్రబెల్లి కూడా బత్తాయి తోటలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మొత్తం 2,800 ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉండగా 1,500 ఎకరాల్లో బత్తాయి, నిమ్మతోటలు ఉన్నాయి. గ్రామంలో నీటికొరత తీవ్రంగా ఉండడంతో రెండు బోర్‌వెల్స్ నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. రోజుకు కనీసం 10 బోర్ల చొప్పున వేస్తున్నారు. ఇప్పటికే 150 బోర్లు వరకు వేసినట్టు రైతులు చెప్తున్నారు. లక్కుమాల మధుబాబు అనే రైతు తన ఐదెకరాల బత్తాయి తోటను కాపాడుకునేందుకు రెండు లక్షలు వెచ్చించి ఐదు బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదు. ఇలాగే అనేక గ్రామాల్లో పండ్ల తోటలు ముఖ్యంగా బత్తాయి, నిమ్మ పంటల పరిస్థితి దారుణంగా ఉంది. నల్లగొండ జిల్లాలో ఉద్యానవనశాఖ లెక్కల ప్రకారం దిగుబడి ఇస్తున్న తోటల్లో బత్తాయి 43,672 ఎకరాల్లో, నిమ్మ 9,000, మామిడి 2,160, జామ 387, దానిమ్మ 175, ఇతర పండ్ల తోటలు 1,216 ఎకరాల్లో మొత్తంగా 56,610 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి కాకుండా కొత్తగా సాగు చేసిన తోటలు 10 వేల ఎకరాల వరకు ఉండవచ్చని అంచనా. వీటిల్లో ఇప్పటికే 25 శాతానికి పైగా నీటి ఎద్దడి ఎదు